క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నాతవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ గురువారం ఉదయం ఏర్పాటు చేస్తున్నామని నర్సీపట్నం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే సమయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. నాతవరం సబ్ స్టేషన్ పరిధిలో నాతవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, డి.యర్రవరం, బెన్నవరం, ములగపూడి, చెర్లోపాలెం, జిల్లేడుపూడి, వల్సంపేట, గుమ్మడిగొండ, లింగంపేట, మన్యపురట్ల, తాండవ, చిక్కుడుపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులంతా సహకరించాలన్నారు.

నామినేషన్ స్వీకరణకు ఏర్పాట్లు

- ఆర్వో కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు 144వ సెక్షన్


మాట్లాడుతున్న ఆర్వో సత్యవాణి

మాడుగుల: నియోజకవర్గంలో గురువారం నుంచి ప్రారంభంకానున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు ఏర్పాట్లు సిద్ధం చేశామని ఆర్వో జి.వి. సత్యవాణి బుధవారం తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో ఈ నెల 18 నుంచి 25 తేదీ వరకు స్థానిక ఆర్వో కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. సెలవు రోజుల్లో నామినేషన్లు తీసుకోబోమన్నారు. అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. ఇక్కడ కార్యాలయం నుంచి వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు ఆన్‌లైన్లోగానీ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నేరుగా జమ చేయాల్సి ఉంటుందన్నారు. 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల దాటిన తర్వాత వచ్చిన నామినేషన్లు తిరస్కరిస్తామన్నారు. 26వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్క్రూట్నీ, 29వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల విత్‌డ్రా ఉంటుందన్నారు .

సర్పంచ్, ఉప సర్పంచ్ రాజీనామా చేయాలి


వడ్డాదిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన వడ్డాది సర్పంచ్, ఉప సర్పంచ్ వెంటనే వారి పదవులకు రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, 12 మంది వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు. బుధవారం వడ్డాదిలో వారు మాట్లాడుతూ స్వార్థం కోసం జనసేనలో చేరి వడ్డాదిలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అయిపోయిందని ప్రచారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్డాది మేజర్ పంచాయతీలో 14 వార్డు మెంబర్లగాను 12 వార్డు మెంబర్లు, ముగ్గురు ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, 20 మంది క్యాడర్ ఉన్న నాయకులతోపాటు జన బలం ఉండగా వైఎస్సార్‌సీపీని ఎవ్వరూ ఏమీ చేయలేరన్నారు. వడ్డాదిలో కొంతమంది నాయకులు మాత్రం టీడీపీ, పీఆర్పీ, జనసేన అన్ని పార్టీలు మారుతూ నిలకడలేని రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. వడ్డాది పంచాయతీలో రూ.13 లక్షలతోపాటు మరో రూ.15 లక్షల సంతపాట డబ్బులకు లెక్కలు లేవని, వాటిపై విచారణ చేయిస్తామని తెలిపారు. వడ్డాదిలో ఏనాడూ కుల రాజకీయాలు చేయలేదన్నారు. వైస్ ఎంపీపీ కుల రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీలో దుష్టశక్తులన్నీ వెళ్లిపోయాయని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని, ఎంపీగా బూడి ముత్యాలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, ఇంటి అప్పారావు, వడ్డాది కోఆపరేటివ్ అధ్యక్షుడు కోవెల ఈశ్వరరావు, వార్డు మెంబర్లు, నాయకులు గరికిపాటి బాలాజీ, సయ్యపురెడ్డి కొండబాబు, అడపా వరహాల బాబు, జి. వెంకటలక్ష్మి, సిహెచ్ రమణ, ఇంటి రాజేశ్వరి, మామిడి చిన్నమ్మలు, ఉల్లి భవాని, బి.మాణిక్యం, బి. పార్వతి, బి. లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.


నాతవరం రామాలయంలో సీతారాములు కల్యాణం


జేడీపేటలో సీతారామ కల్యాణంలో ఎంపీపీ రాజరామ్ దంపతులు


రోలుగుంట పాత రామందిరంలో సీతారాములు కల్యాణం

వేడుకగా జగత్కల్యాణం

గ్రామగ్రామాన రామనామం మార్మోగింది. పచ్చని పందిరి కింద వేదమంత్రాల సాక్షిగా, మేళతాళాల నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. అందరి బంధువు రామయ్య పెళ్లికి తరలివచ్చిన జనులంతా కనులారా వీక్షించి ఆనందించగా, అవజనిరాములు ఒక్కటయ్యారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు.


తారువలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయిుడు దంపతులు

- మేళతాళాలు, వేదమంత్రాల సాక్షిగా వివాహం
- ఒక్కటైన సీతారాములు
- కనులారా వీక్షించి తరించిన భక్తజనం
- వైభవంగా శ్రీరామనవమి మహోత్సవం
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, బూడి, ధర్మశ్రీ


మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో


జంపెనలో పెళ్లిరాట వేస్తున్న దృశ్యం


మాడుగుల రూరల్: కె.జె.పురం రామాలయం వద్ద


గొలుగొండ: పూజలు చేస్తున్న భక్తులు


తాండవలో సీతారాములను దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ నాగగోపి, పామాయిల్ కార్పొరేషన్


మాకవరపాలెంలో సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు


మాడుగుల రూరల్:ఎం . కోటపాడు రామాలయంలో..

చోడవరం: శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా ఎంతో సందడిగా జరిగాయి. బుధవారం శ్రీరాముని పెళ్లి సందడిలో జనమంతా తేలియాడారు. ఎక్కడ చూసినా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెళ్లి పందిళ్లు, కల్యాణ వేదికలతో అంతా కళకళలాడింది. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య కల్యాణం కనుల పండువగా జరిగింది. అంబేరుపురం, గాంధీ గ్రామంలో రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సతీసమేతంగా పాల్గొని స్వామివారికి కల్యాణం జరిపించారు. పట్టువస్త్రాలు, తలంబ్రాలు స్వామివారికి సమర్పించారు. చోడవరం పట్టణంలో అన్నవరం రామాలయంలో ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. బోళ్లవీధి, వెలమవీధి, నాడువీధి, యడ్ల వీధి రామాలయాల్లో స్వామివారి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. వ్యాపార వీధిలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం చేశారు. స్వయంభూ గౌరీశ్వరాలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మండపాల్లో అందంగా అలంకరించిన సీతరాముల ఉత్సవ మూర్తులను ఉంచి కల్యాణం చేశారు. గోవాడలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, శీమునాపల్లిలో సర్పంచ్ కురుకూటి భోగేష్ దంపతులు, గంధవరంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వెంకన్నపాలెం వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు దంపతులు, లక్కవరం శీరంరెడ్డి వెంకటరమణ, మైచర్లపాలెంలో సర్పంచ్ బూరె మాణిక్యం, ఖండిపల్లిలో సర్పంచ్ శానాపతి రాజశేఖర్, గజపతినగరంలో మళ్ల శ్రీనువాసరావు, బెన్నవోలులో మూడెడ్ల శంకరరావు, గాంధీ గ్రామంలో గాడి అప్పారావు, దుడ్డుపాలెంలో కూర్మదాసు మాలిబాబు, దామునాపల్లిలో బలిరెడ్డి నాగేష్, గౌరీపట్నంలో కోన చంద్రరావు, రామజోగిపాలెంలో పోతల ప్రసాద్ దంపతులు స్వామివారికి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవంలో పానకం, స్వామివారి ప్రసాదం పంచిపెట్టారు.

తారువలో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పూజలు

దేవరాపల్లి: తారువలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కనుల వైభవంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు వడ్డన చేసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు. డాక్టరు వరదపురెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, వరదపురెడ్డి లలితానాయుడు, కె.వి. రమణ, గుండు రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. దేవరాపల్లి, మామిడిపల్లి, బోయిలకింతాడ, ఎం. అలమండ, కొత్తపెంట, ఎ. కొత్తపల్లి, నాగయ్యపేట తదితర గ్రామాలన్నీ రామనామంతో మారుమోగాయి.

నర్సీపట్నం/మాకవరపాలెం/నాతవరం/గొలుగొండ: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని అన్ని రామాలయాల్లో స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. రామాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. నర్సీపట్నంలో పురాతన రామాలయమైన కోమటవీధి రామాలయం, వెలమ వీధి, కాపు, కొత్త వీధి, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం, మాకరపాలెం, నాతవరం, గొలుగొండ, తదితర రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేసి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. రామాలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నసమరాధానలు నిర్వహించారు.

మాడుగుల/మాడుగుల రూరల్/చీడికాడ/కె.కోటపాడు: మాడుగుల పట్టణంలో పాండవుల కొండపై వెలసిన పార్థసారథి స్వామి ఆలయంలో శ్రీరాముని జనని కార్యక్రమం జరిగింది. గవర వీధిలో వైభోగ సీతారామ స్వామి, కోట సమీపంలో సీతారామ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. సత్యవరం, జేడీపేట, ఎం. కోటపాడు, కె.జె.పురం, చీడికాడ, అర్జునగిరి, చిరికివానిపాలెం, తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. చౌడువాడలో రాజి అప్పలానాయుడు దంపతులు, వి.సంతపాలెంలో లెక్కల దేవీలత, రొంగలినాయుడుపాలెంలో సర్పంచ్ పైల పైడితల్లమ్మ, గుల్లేపల్లిలో సర్పంచ్ బండారు దేముళ్లు దంపతులు కల్యాణం జరిపించారు.

రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట: గ్రామగ్రామాన, వీధి వీధిన సీతారామ కల్యాణ మహోత్సవాలు బుధవారం కనుల పండువగా జరిగాయి. చలువ పందిళ్లు, పానకాలు, పప్పు బెల్లాలు, సన్నాయి, మంగళ వాయిద్యాలతో పల్లెలు సందడి నెలకొన్నాయి. ఇంటింటి నుంచి కల్యాణ మహోత్సవానికి కానుకలు, పండ్లు కాయలు సమర్పించుకున్నారు. కల్యాణ మహోత్సవంతోపాటు సీతారాముల కథను పండితులు వినిపించారు. రావికమతం, దొండపూడి, కొత్తకోట, మర్రివలస, కన్నంపేట, టి.అర్జాపురం, మరుపాక, తోటకూరపాలెం, గుడిప, నాగన్నపాలెం తదితర గ్రామాల్లోనూ అన్న సమారాధనలు నిర్వహించారు. రోలుగుంటలో ఈ నెల 9న ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఆలయ ధర్మకర్త పోతల లక్ష్మీశ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సింహాచలం స్వామివారి లడ్డూలు పంచిపెట్టారు. బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది, రాజాం, విజయరామరాజుపేట, రాజాం, దిబ్బిడి, గున్నెంపూడి, తురకలపూడి, పెదపూడి, సీతయ్యపేట, పొట్టిదొరపాలెం, చిన అప్పనపాలెం, బంగారుమెట్ట, ఎల్.బి. పురం తదితర గ్రామాల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.


నర్సీపట్నం: స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


చీడికాడ: అర్జునగిరిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


బుచ్చెయ్యపేట: వడ్డాది రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వేడుకలు

కూటమి కుట్రలను తిప్పికొడదాం


ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీలోని 21వ వార్డు శారదానగర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు పూల వర్షం కురిపిస్తూ నీరాజనాలు పలికారు. ఎమ్మెల్యేను సన్మానించి, మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల వారికి రూ. 50 వేల నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. గతంలో చంద్రబాబు 600 హామీలిచ్చి, వాటిని నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెవరేర్చారని వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాలనాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వార్డు కౌన్సిలర్ కర్రి చైతన్య, అయ్యారక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ సమ, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు బి.గణమ్మ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బేతిరెడ్డి రత్నం, నాయకులు చింతకాయల వరుణ్, కర్రి రామ్‌గోపాల్, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గణేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

ధర్మశ్రీ కుమార్తె స్వాతి విస్తృత ప్రచారం

- ఉదయం ఉపాధి కూలీలను, రాత్రిళ్లు గ్రామాల్లో ప్రజలను పలకరింపు


పాపంపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి

రోలుగుంట: చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం ఉపాధి కూలీలను కలుస్తూ.. రాత్రిళ్లు గ్రామాల్లో ప్రజలను పలకరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం కుసుర్లపూడి, కాముడుపాలెం, రొంగలపాలెం చెరువుల్లో పనుల చేస్తున్న వేతనదారులను కలిశారు. రోజుకు వస్తున్న కూలీ, వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. తన సొంత నిధులతో సమకూర్చిన శీతల పానీయాలతో వారి దాహార్తి తీర్చారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ తన తండ్రి ధర్మశ్రీ ఈ ప్రాంతీయులకు సుపరచితుడని, ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారన్నారు. పని ప్రదేశంలో కావాల్సిన వసతుల కల్పనకు తన తండ్రి ధర్మశ్రీ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తానని భరోసా ఇచ్చారు. అదే రోజు రాత్రి కొంతలం పంచాయతీ శివారు పాపంపేటలో ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే సవాలక్ష షరతులు పెట్టేవారని విమర్శించారు. ఇప్పుడు అవేవీ లేకుండానే అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి కలిగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పింఛన్లు పంపిణీని ఆపి వలంటీర్లను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కించపరచే వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అందరు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో చోడవరం ఎమ్మెల్యేగా ధర్మశ్రీని, అనకాపల్లి ఎంపీగా ముత్యాలనాయుడిని గెలిపించాలని కోరారు. స్వాతి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక నాయకులు చినబాబు, నానాజి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం నెరవేర్చి ప్రజల్లోకి వచ్చాం


- గొండిపాలెంలో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం


గొండుపాలెంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సతీమణి కళావతి

గొలుగొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ, అభివృద్ధి వల్ల ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నామని, ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చి ఎన్నికలకు వచ్చామని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను అత్యధిక మెజారీతో గెలిపించుకోవాలని పెట్ల కళావతి కోరారు. బుధవారం రాత్రి గొండిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, సీసీరోడ్లు నిర్మించామని, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ముఖ్యంగా దళితవాడల్లో ఆమె ఇంటింటికీ వెళ్లగా, మహిళలు నీరాజనం పలికారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యేలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. సీఎం జగన్‌ను ఓడించడం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ జతకట్టాయని, ప్రజా తీర్పులో అవి కొట్టుకుపోవాలన్నారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జెలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణి శాంతారావు, సర్పంచ్ జాగు రాము, ఎంపీటీసీ కొరుప్రోలు నూకరత్నం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోచల సుజాత, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సీనియర్ నాయకుడు జాగు రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దగాకోరు టీడీపీకి ఓటేస్తే అధోగతి

- ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ రాంబాబు


నీలకంఠాపురంలో ప్రచారంలో పాల్గొన్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: దగాకోరు టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా బుధవారం నీలకంఠాపురంలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. టీడీపీ నాయకుల కుట్రతో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. ఇంటింటికీ వలంటీర్లు వచ్చి పింఛన్ సొమ్మును ఇవ్వకుండా అడ్డుకోవడంతో ఈ నెలలో లక్షలాది మంది పింఛన్‌దారులు అవస్థలు పడ్డారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీరు వ్యవస్థను తొలగిస్తారని, ఇంటికొచ్చే పింఛన్, రేషన్ బియ్యం ఆగిపోవడమే కాక అమ్మఒడి, రైతు భరోసా, విద్యా, వసతి దీవెన, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ తదితర పథకాలన్నీ నిలిపివేస్తారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ జగనన్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్‌లు నాగభూషణం, మరిసా నాని, నాయకులు అమ్మునాయుడు, నమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల తయారీపై ముగిసిన శిక్షణ


తాళ్లపాలెం గురుకులంలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న విద్యార్థులు

కొంకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రాజెక్టుల తయారీపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పర్యవేక్షణలో విద్యార్థులతో తయారు చేయించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. జిల్లా గురుకులాల కో–ఆర్డినేటర్ ఎస్. రూపావతి, ప్రిన్సిపాల్ జి. గ్రేస్, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి కె.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రోలుగుంట: నర్సీపట్నం- వడ్డాది ఆర్‌అండ్‌బీ రోడ్డులో నిండుగొండ కూడలి సమీపంలో సాయినాథుని మందిరం వద్ద ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు గోవింద, శంకర్ సత్యనారాయణ, పూజారి సత్యనారాయణ తెలిపారు. సాయి వెంకట నర్సింగ్ హోం సౌజన్యంతో నిర్వహించనున్న ఈ శిబిరంలో రోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలని కోరారు. ఇక్కడ నిర్మితమైన సాయినాథుని 21వ వార్షికోత్సవం సందర్భంగా ఈ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com